*ప్రాణాధికంగా ప్రేమించిన వ్యక్తి ఆమె. ఆమె కోసమే ఒకప్పుడు న్యాయం ధర్మం మినహాగా సర్వస్వమూ త్యాగం చేసినవాడు. ఇప్పుడు ఆమె అతనిముందు నిలిచి, దీనంగా పసుపు కుంకుమలు యాచిస్తున్నది.*

---

మెట్టుపల్లి లక్ష్మీనారాయణరెడ్డి

ప్రకృతి విలయతాండవం చేస్తున్నది. గాలి, వాన జోరుగా కొడుతున్నవి. ఆ రోజు వాతావరణం ప్రకృతి వినాశనానికి నాందేమోనన్నంత బీభత్సంగా ఉంది. ఆ సుడిగాలి ధాటికి మహా వృక్షాలూ కూకటి వేళ్ళతో పెళ్ళగింపబడి, సాగిల పడుతున్నాయి. ఉరుములకు మెరుపులకు అంతే లేకుండా ఉంది. దబ, దబాయని పెద్దగా శబ్దం చేస్తూ వర్షం కురుస్తున్నది. జియ్, జియ్ మని హోరుచేస్తూ సుడిగాలి వీస్తున్నది. జిగేల్ మని కన్నులు మిరుమిట్లు కొల్పేలా మెరుపులు మెరుస్తున్నాయి. ధన్, ధన్‌మని భయంకరంగా శబ్దంచేస్తూ ఉరుములు హడావుడి చేస్తున్నాయి. మెరుపులు మెరసినప్పుడల్లా ప్రజల గుండెలు భయంతో భగ్గుమంటున్నాయి. ఉరుములు ఉరిమినప్పుడల్లా, పిల్లలు వెరపుతో ముడుచుకు పోతున్నారు. పెద్దలు, వారిని సముదాయిస్తూ, 'అర్జునా! ఫల్గుణా! పార్థా!' అంటూ భయం



భయంగా ఆకాశంకేసి చూస్తున్నారు. పరమ నాస్తికులు కూడా భగవంతుణ్ణి మనసారా ప్రార్థిస్తున్నారు. ఆపదలలోనే కదా మానవుడూ మానవాతీత శక్తులకు దాసుడయ్యేది! అనాది నుండి మానవుడిలో కరడుకట్టుకుపోయిన ఈ భీతిచేతే మానవుడు ప్రకృతికి దాసోహ మంటున్నాడేమో!

ఉండి, ఉండి, ఎక్కడో తీతువుపిట్ట భయంకరంగా అరుస్తున్నది. ఈ బీభత్సానికి తోడు ఆ రోజు విద్యుద్దీపాలు కూడా ఆరిపోయాయి. జనం మరీ విపరీతంగా భీతిల్లిపోతున్నారు. అందరు ప్రాణా లరచేతిలో పట్టుకొని అల్లాడిపోతున్నారు.

రాత్రి రెండు గంటలయినా, రద్దీగా ఉండే పురవీధులు ఆ రోజు నిర్మానుష్యంగా కనపడుతున్నాయి. రంగు రంగుల విద్యుద్దీపాల వెలుతురులో కళకళలాడే అంగళ్ళు, హోటళ్ళు మూయబడి వెల వెలాపోతున్నాయి. ఇంతటి భయంకర నిశ్శబ్ద నిశీధిలో కూడా అప్పుడప్పుడు హోరు చేస్తూ పయనించే కార్లు మానవుని నిర్భీతిని చాటుతున్నాయి.

బయట, ఇంత భయంకరంగా ప్రకృతి ప్రళయతాండవం చేస్తున్నా, పట్టణానికి కొద్ది వెలుపలగా ఉన్న పెద్ద బంగళాలోని కచేరి గదిలో ఒక మానవుడు బయటి ప్రపంచం సంగతి పట్టించుకోనివాడిలా తదేకంగా బల్లమీద వెలుగుతున్న కొవ్వొత్తిని చూస్తూ కూర్చున్నాడు. బయట చండ ప్రచండంగా రేగుతున్న తుఫానును సైతం గుర్తించే స్థితిలో లేడు అతను. తన బుద్ధిని అంతర్ముఖంచేసి, దేన్ని గురించో తదేకంగా ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాడు. అతని గుండెల్లో యింతకంటే పెద్ద ప్రళయాలే పరుగులు తీస్తున్నాయి. పెను తుఫానుల్లాంటి ఆలోచనలు అతని మెదడులో సుడులు తిరుగుతున్నాయి.

దేనికోసం అతను ఇంతగా సతమతమవుతున్నాడు? లోకంచే వంచింపబడి తన దురదృష్టాన్ని నిందించుకుంటున్నాడా? జాలిలేని, విధి కరాళదంష్ట్రలలో నలిగిపోయి పరితపిస్తున్నాడా? లోకాన్ని వంచించబోయి గోతిలోపడి, పైకి రావడానికి దారి కనుపించక అవస్థపడుతున్నాడా? ఘోరమైన నేరాలుచేసి, పశ్చాత్తాప పడుతున్నాడా? ఇవేమీ అతని ఆలోచనకు కారణాలు కావు.

అతను ఈ పట్టణానికి వచ్చినప్పటినుండి, అనగా గడిచిన పదేళ్ళనుండి ఆ బంగళాలో పరమ ప్రశాంతంగా జీవిస్తున్నాడు. అతనికి ఆలుబిడ్డలు లేరు. బంధువు లెవరైనా ఉన్నారేమో కాని, అతన్ని చూడటానికి ఎవరూ రారు. లంకంత ఆ బంగళాలో అతను ఒంటిగా, ఒక వంటవాడు, ఒక నౌకరుతో సహజీవిస్తున్నాడు. అన్ని అనుబంధాలను తెంచుకొని, అన్ని అనుభూతులకు దూరమై ప్రశాంతంగా, ఏకాంతంగా జీవిస్తున్న అతనికి ఇంతగా ఆలోచించవలసిన అవసరం ఏం కలిగింది?

అతని పేరు జగన్నాథం. ఆ పట్టణపు న్యాయస్థానంలో న్యాయాధికారి అతను. ఆ రోజు అతని హృదయంలో మానవతకు, మమతా శూన్యమయిన చట్టానికి సంకుల సమరం సాగుతున్నది. ఆలోచించే కొద్దీ అతని బుర్ర ఖాళీ అయిపోతున్నట్టుంది.

దట్టంగా అలుముకున్న కారుమేఘాలు మెల్ల మెల్లగా పలచబడుతున్నాయి. ఉరుములు, మెరుపులు ఆగిపోయాయి. కుండపోతలుగా కురుస్తున్న వర్షం తగ్గిపోయింది. మెల్లగా చినుకులు పడుతున్నాయి. భయంతగ్గి జనం నిద్రాదేవి ఒడిలో నిశ్చింతగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

బయటి బీభత్సం తగ్గిపోయినా, జగన్నాథం గుండెల్లోని మంటలు చల్లారలేదు. అతని మనసులోని ఆలోచనలు ఒకదరికి చేరలేదు. అతనిలో జరుగుతున్న సంఘర్షణ సాగిపోతూనే ఉన్నది. దాని ఉధృతం రాను రాను ఎక్కువవుతూనే ఉన్నది కాని తగ్గడం లేదు.

ఎలా తెల్లవారిందో జగన్నాథానికి తెలియకపోయినా, తెల్లవారిపోయింది. పిట్టల కలకలారావంతో, కోడి కూతలతో, నిన్నటి అనుభవాలతో, నేటి భయాలతో, రేపటి ఆశలతో లోకం మేల్కొంది.

'భొయ్' మనే సైరన్ రాకాసి అరుపుతో పట్టణం ప్రజలు మేల్కొన్నారు. కొద్దిసేపట్లో వీధులు జనసమ్మర్దాలవుతాయి. మిల్లులకు వెళ్ళే కూలీలు అపుడే ఒకరూ, ఇద్దరూ ఇళ్ళనుండి బయటపడుతున్నారు. రాత్రి పని కార్మికులు, నిట్టూర్పులు విగుడిస్తూ మిల్లులనుండి బయట పడుతున్నారు.

దూర తీరాలలో, తూర్పు శిఖరంపై అరుణ బింబం, అందంగా అలంకరించుకొన్న వధువులా అలరారుతున్నది.

లోకానికి తెల్లవారినా, జగన్నాథం ఆలోచనలు తెల్లవారలేదు. రాత్రంతా నిద్రలేకుండా అంతులేని ఆలోచనలతో సతమత మవుతున్నాడు, జస్టిస్ జగన్నాథం. అతనొక గడ్డు కేసులో తీర్పు చెప్పవలసి ఉంది మరుసటి దినం. అతని కేమీ పాలుపోకుండా ఉంది.

ఆరు మాసాలనుండి ఆ ఊరిని గడగడలాడించిన ఘోరమైన ఖూనీ కేసులో తీర్పు చెప్పాలి జగన్నాథం. సహజంగా జగన్నాథానిది జాలి గుండె. మానవత్వంమీద చెరిగిపోని గురి అతనికి. మమత, మానవతలే మానవుని ఉన్నత స్థితికి ప్రథమ సోపానాలని అతని గాఢ నమ్మిక. ఎంతటి దుర్మార్గులనయినా, ఎంతటి ఘోర పాపాలకు ఒడిగట్టిన నేరస్తులనయినా క్షమించగల పరమపావనమైన మమతా హృదయం ఆయనది. నేరస్తులను శిక్షలు సంస్కరింపలేవని, హృదయ పరివర్తనే ముఖ్యమని అతని విశ్వాసం. చట్టంఎడల, న్యాయంఎడల ఎనలేని గౌరవం కలవాడయినా నేరస్తులను కఠినంగా శిక్షించలేకపోయేది అతని జాలిగుండె. అతడు నేరస్తుల ఎడల చూపే దయ, ఒక్కోసారి మితిమీరుతుండేది. ముద్దాయిలు అతనివద్ద తమ కేసు వేయించుకునేందుకు నానా అవస్థ పడేవారు.

కాని, ఈ కేసు అన్ని కేసుల లాటిది కాదు. ఈ కేసులోని ముద్దాయి, పట్టపగలు, ఒక బహిరంగ ప్రదేశంలో, తుపాకి బాకుతోఒకర్ని పొట్టపొడిచి ఘోరంగా హత్య చేశాడు. ప్రాసిక్యూషన్ వారు, అనేకులు ప్రత్యక్ష సాక్షులను కోర్టులో విచారించి, కేసును చాలా పటిష్ఠంగా జరిపించారు. ముద్దాయి నేరం చేశాడనడంలో ఏమీ సందేహం లేదు.

"నిందితుడికి తప్పకుండా శిక్ష పడుతుంది. ఈసారి జగన్నాథం గారేం చేస్తారో చూడాలి" అని యిటు పట్టణ ప్రజలు, అటు న్యాయవాదులు ఆతురతతో అతని తీర్పుకై ఎదురు చూస్తున్నారు.

నిందితుడు నేరం చేయలేదని కనీసం అనుమానించేందుకైనా, ఒక పాయింట్ కనపడుతుందేమోనని రాత్రంతా కేసు రికార్డ్ పరీక్షచేస్తూ జాగారం చేశాడు జగన్నాథంగారు. కాని, అలాంటి ఆశ లేమీ ఫలించేట్టులేవు. అతను విచారించిన ప్రతి కేసులోనూ, నిందితుడు నేరం చేశాడని రుజువు అయేందుకు ఎన్ని పాయింట్లు ఉండేవో, అతను నేరం చేయలేదని వాదించేందుకు కూడా అన్నిపాయింట్లుండేవి. జగన్నాథంనేరస్తునికి 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' ఇచ్చి కేసు కొట్టేసేవాడు. మరీ గట్టి కేసయితే, కొద్దిపాటి శిక్షలతో పోనిచ్చేవాడు. "వందమంది నేరస్తులు చట్టం చేతినుండి తప్పించుకున్నా ఫరవాలేదు కాని, ఒక అమాయకుడు శిక్షింపబడరాదు" అనికదా న్యాయ సూత్రం. ఆ సూత్రాన్ని అక్షరాలా పాటించేవాడు జడ్జి జగన్నాథం.

ఇంతవరకూ అతని సర్వీసులో యిలాంటి గడ్డు కేసు ఎప్పుడూ రాలేదు. దాదాపు మతిపోయినవాడిలా గదిలో పచార్లు చేస్తున్నాడు జగన్నాథం. "ఓరి! భగవంతుడా!" కడకు ఇన్నాళ్ళకు నేను చేయకూడ దనుకున్న పనిని చేయిస్తున్నావా? నా కలం పోటుతో ఒక మనిషి ప్రాణం పోవలసిందేనా?" అని వలవలా వాపోతూంది జగన్నాథం జాలి గుండె. ఇక తాను విస్సహాయుడని తెలుసుకున్నాడు.

రాత్రినుండి అతని గుండెల్లో ప్రజ్వరిల్లుతున్న సమరం అఖరయింది. కఠినమైన చట్టం ముందు, అతని దయాహృదయం ఓడిపోయి తల వంచింది. దేశంలో శాంతి భద్రతలను రక్షించవలసిన న్యాయాధికారిగా అతని బాధ్యత

> అనుసరించగలవాడే శాసించగలడు. తొలుత వినయం నేర్చుకో. మనకు సంస్థ అవసరం. సంస్థయే శక్తి. వినయమే దానికి ఆధారం.
> —స్వామి వివేకానంద

అతని మమతను దారుణంగా హత్య చేస్తున్న జాలిలేని న్యాయ సూత్రాల ఎదుట, అతని జాలి గుండె నిస్సహాయంగా, నిశ్శబ్దంగా విలపిస్తున్నది.

అతను అచేత నుడిలా, కొద్దిసేపు అలాగే కూర్చుండిపోయాడు. ఇక లాభంలేదని నిర్ణయించుకొని తీర్పు వ్రాద్దామని కలం చేతిలోకి తీసికొన్నాడు.

ఇంతలో ఎవరో తలుపువద్దకు వచ్చినట్లు అలికిడి అయింది. అతను తల ఎత్తి చూశాడు. అంతే. అతని చేతిలోని కలం నేల జారింది. అతని నోటినుండి "శశి" అన్న ముక్క అప్రయత్నంగా వచ్చింది.

ఆమె మధ్య వయస్కురాలిలా కనిపిస్తున్నా అందంగా, ఆకర్షణీయంగా కనుపిస్తున్నది. ఆమె కట్టిన ఎర్రంచు నీలం పట్టుచీర, ఆమె తొడిగిన ఆకుపచ్చ వెల్వెట్ జాకెట్ ఆమె కళాభిరుచిని చెప్పక చెప్పుతున్నాయి. ఆకర్షణీయంగా ముస్తాబయినా ఆమె అందమయిన ముఖంమీద ఏవో వెరగని నీలి నీడలు కదలాడుతున్నాయి. రాత్రంతా నిద్ర లేనట్లు, ఆమె కన్నులు ఎర్రగా ఉన్నాయి. అంతేకాకుండా ఎన్నో రోజులనుండి ఏడుస్తున్నట్లు కళ్ళు ఉబ్బిపోయి ఉన్నాయి. అంతటి దీనపరిస్థితులో కూడా ఆమె జగన్నాథాన్ని చూసి, చిరునవ్వు నవ్వింది. గంభీరంగా కనుపించాలని ఆమె శతథా ప్రయత్నిస్తున్నది.

"ముందు లేచి వెళ్ళి మీ ముఖం కడుక్కొని రండి. రాత్రంతా మేలుకున్నారు గావాలి. కన్నులు ఎర్రగా వాచివున్నాయి." కంచులా మ్రోగిన ఆమె కంఠం అతని అనిశ్చిత స్థితిని వదలకొట్టింది. నిద్రపోతున్నవానివలె లేచాడు. ఇంతలో మరీ కూర్చుండిపోయాడు.

జగన్నాథానికి అంతా కలలా గోచరిస్తున్నది. అతని మనసు జ్ఞాపకాల అగాధంలోకి జారిపోయింది. శశి ఏమీ మారలేదు. అదే రూపం. అదే అందం. తనను ఒకప్పుడు పిచ్చివాణ్ణి చేసిన అందం ఆమెలో ఇంకా నమసిపోలేదు. ఆమె స్వరంలో ఆదే అధికారం ధ్వనిస్తున్నది. "ఆమె మాట ఎందుకు వినాలి" అని ఎదురు సవాల్ చేస్తున్నది అతని మేధ.

"లేచి వెళ్ళండి." ఆమె మరోసారి హెచ్చరించింది.

ఏదో మానవాతీతమైన శక్తి, ఆమె అధికారానికి లొంగిపొమ్మని అతన్ని శాసిస్తున్నది. బహుశా ఆ మహత్తర శక్తి ఆమెపై అతనికున్న ప్రేమేనేమో! అతడు మాటాడకుండా లేచి స్నానాల గదివైపు నడిచాడు.

జగన్నాథం స్నానంచేసి వచ్చి సోఫాలో కూర్చున్నాడు. అంతదాకా బల్లమీదున్న 'రాధా కృష్ణ' విగ్రహాన్ని తదేకంగా చూస్తున్న శశి, అతనివైపు తిరిగి "వంట మనిషిని కాఫీ, టిఫిన్ తెమ్మన్నాను" అంది.

అతను అమితాశ్చర్యంతో ఆమె వైపు చూశాడు. ఆమెకూ, తనకూ అనుబంధాలు తెగి సుమారు పది సంవత్సరాలవుతున్నది. అయినా ఆమె అది తన గృహంగానే భావించినట్లు అధి

# తీర్పు

కారం చెలాయిస్తున్నది. అదే తన శశి ప్రత్యేకత. ఆ ప్రత్యేకతకే ఒకప్పుడు అతను జోహారన్నాడు. తనకు నచ్చినది చేయడానికి శశి ఎప్పుడూ తటపటాయించదు; తన కిష్టంలేని పని చచ్చినా చేయదు. ఆమె ఈ ప్రత్యేక ప్రవృత్తే, ఆమెను జగన్నాథానికి సన్నిహితురాలిని చేసింది. అదే ప్రవృత్తే ఆమెను జగన్నాథాన్నుండి విడదీసింది.

"అయితే జగ్గూ! పెద్ద జడ్జి వయ్యావన్నమాట. నే నెప్పుడైనా నీ మదిలో మెదులుతానా?" అంది శశి.

అనుక్షణం తన హృదయం ఆమె తలపులతోనే నిండి ఉంటుందని ఆమెకు తెలుసు. అయినా ఆ విషయం అతని నోటినుండి వినాలని ఆమెకు కుతూహలం. ఎవరు తనకోసం బాధపడినా సహించలేదు శశి. తానూ వారికోసం అంత బాధా పడుతుంది. కాని తనకు మనసులేని చోట మాత్రం ఒక క్షణం నిలవలేదు ఆమె. పరస్పర విరుద్ధమయిన ఈ భావాల కలయికే శశి. ఈ వింత గుణమే పదేళ్ళ క్రిందట, తనను ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన జగన్నాథాన్ని కాదని, ఆమెను ఇంకొకరితో లేచిపోయేట్లు చేసింది.

వంట మనిషి కాఫీ, టిఫిన్ తెచ్చిపెట్టాడు. ఇద్దరూ మౌనంగా కాఫీ తీసుకున్నారు. ఫలహారం చేయమని శశి బలవంతం చేయలేదు. జగన్నాథం ఫలహారం చేయలేదు.

"జగ్గూ! నాకో చిన్న సహాయం చేసిపెట్టాలి" అంది శశి. జగన్నాథం మాట్లాడకుండా ఆమెను చూస్తూ కూర్చున్నాడు.

"నేను హృదయపూర్వకంగా ప్రేమించేవ్యక్తి ప్రాణం నీదయా భిక్షమీద ఆధారపడి ఉంది జగ్గూ." శశి గొంతులో మార్పులేదు. కాని ఎక్కడో ఆమె హృదయాంతరాళాలలో ఆమె పడే వేదన, ఆమె గొంతులో కీచుగా మ్రోగుతున్నది.

జగన్నాథం మొహం వెలవెలా పోయింది. కొద్ది గంటల్లో తాను మరణశిక్ష విధించబోయే వ్యక్తి, తన ప్రేమంపు శశి భర్తా? అతని తల గిర్రున తిరుగుతున్నది.

"శశీ" అని మాత్రం అనగలిగాడు. ఆ రెండక్షరాలలో అతని హృదయవేదన అంతా ఇమిడి వుంది.

"అవును జగ్గూ! ఎందరో నన్ను ప్రేమించారు. కాని నేను మాత్రం ఒక్కరినే ప్రేమించ

> *నాతోడివారికి నన్ను తోడు పడనివ్వండి. నేను కోరేది అది ఒక్కటి మాత్రమే.*
>
> —స్వామి వివేకానంద

గలిగాను. కాని అతను, మానవత్వం ఇసుమంతైనా లేని 'పశు'ప్రాయుడని కొద్దికాలంలోనే తెలిసింది. అయినా, అతని దుర్గుణాలు, అతనిమీద నాకున్న అనురాగాన్ని సడలించలేకపోయాయి. భారత స్త్రీ, తన జీవితంలో ఒక్కరికి తన హృదయం ఇవ్వగలదు. అత నెంత దుష్టుడైనా అతన్నే ఆరాధిస్తుంది ఆమె. ఏనాటికైనా మనిషన్న తర్వాత మార్పు రాకుండా వుంటుందా అని ఓర్మితో కత్తిమీద సాములా, అతనితో ఈ పదేళ్ళు కాపురం చేశాను. కాని అతనిలో మార్పు లేకపోగా, అతనిలోని పశుత్వం పెంపొందింది. కడకు ఆ పశుత్వం సాటి మానవుని ప్రాణం తీసే దాకా ప్రాకింది. అయినా నే నతన్ని హృదయపూర్వకంగా క్షమిస్తున్నాను జగ్గూ! కాని నాకొకటే విచారం. హృదయానికి హృదయంగా ప్రేమించిన నిన్ను ప్రేమించలేకపోయాను. ప్రేమించిన పురుషుని రూపొందించుకోలేకపోయాను.

"జగ్గూ! నీవు నన్ను హృదయపూర్వకంగా ప్రేమించావు. నాకోసం నీ అంతస్తును, కులాన్ని, ధనాన్ని, కడకు కనిపెంచిన తలిదండ్రులను, సర్వాన్ని వదులుకున్నావు. కాని నేను నిన్ను ప్రేమించలేకపోయాను. నీవు నన్నెంతో ఆదరించి అభిమానించావు జగ్గూ! అయినా, నేను నిన్ను వదిలి నిర్దాక్షిణ్యంగా ఇంకొకరితో వెళ్ళిపోయాను. అందుకు నే నేమీ చింతించడంలేదు. ఇప్పటికీ సరయిన పని చేశాననే మనశ్శాంతి నాకుంది. నీ మేలు కోరేవా రెవరైనా అంతకంటే ఏమీ చేయలేరు జగ్గూ! నేను దూరమైన తరువాతైనా నీవు, నీ అంతస్తుకు తగిన అమ్మాయిని వివాహం చేసుకొని సుఖిస్తావనుకున్నాను. కాని ఇలా నాకోసం, ఆ జన్మ బ్రహ్మచర్యం అవలంబిస్తావనుకోలేదు. ఈ విషయాన్ని నేను ఛాయామాత్రంగా ఊహించగలిగినా నిన్ను వదిలిపోయే దాన్ని కాదు జగ్గూ! వదిలిపోయే దాన్నికాదు.

"ఇలా నీముందు భిక్షుకిలా నిలువవలసి వస్తుందని నేను అనుకోలేదు. కాని జగ్గూ! హైందవ స్త్రీకి ప్రాణంకంటే ఎక్కువయినది మాంగల్యం. పసుపు కుంకుమ కోసం ప్రాణమైనా సంతోషంగా త్యజించడం భారత స్త్రీకి కొత్తగాదు. ఈ పతిభిక్ష కోసమే ఎవరి ముఖమైతే ఈ జన్మానికి చూడకూడ దనుకున్నానో, వారినే అభిమానాన్ని త్యజించి యాచిస్తున్నాను.

"నేను చేసిన ద్రోహానికి నీవు నన్ను క్షమించగలవని తెలుసు జగ్గూ! అయినా నన్ను క్షమించమని నిన్నడగను. కాని, ఈ కడసారి కోర్కె తీరుస్తావని గంపెడాశతో వచ్చాను జగ్గూ!"

రాను రాను, శశి కంఠం గద్గద మవుతున్నది, ఎలాగో నిగ్రహించుకొని కడపటి మాటలను పలుకగలిగింది.

శశి మాట్లాడుతున్నంతసేపూ ఆమె మాటలు వినడం తప్ప ఏమీ చేయలేకపోయాడు జగన్నాథం. అతనికి తెలుసు, ఆమె తనను మాట్లాడ నివ్వదని.

తన ఆత్మనైనా వధించుకొనగలడు కాని, శశి కోర్కెను తీర్చకుండా ఉండలేడు జగన్నాథం.

ఎవరినైతే తాను ప్రాణసమంగా ప్రేమించాడో, ఎవరికొరకైతే తాను సర్వాన్నీ త్యాగం చేయగలిగాడో, ఆ శశి తనముందు నిల్చుని, దీనంగా, పసుపు కుంకుమ యాచిస్తున్నది. తాను ప్రేమించిన శశి తనను కాదని మరో మనిషిని పెళ్ళి చేసికొంది. ఆ శశి కోసమే తాను ఈ పది సంవత్సరాలు మూగవేదన అనుభవించాడు. ఆ శశి కోసమే తాను సర్వ సుఖాలకు దూరమై, నిస్సంగుడుగా జీవిస్తున్నాడు.

ఇది తాను శశికి ప్రతీకారం చేసేందుకు అవకాశమా? లేక తన ప్రేమంపు శశికి తాను కడసారిగా సమర్పించుకొనే ప్రేమకానుకా?

జగన్నాథం గుండెల్లో తుఫానులు రేగుతున్నాయి. అతనికి ఏటూ పాలుపోకుండా ఉంది. తన శశికోసం న్యాయాన్ని, ధర్మాన్ని బలి చేయాలా? న్యాయంకోసం, చట్టంకోసం, తన విధి నిర్వహణకోసం తన శశి కడపటి కోరిక త్రోసివేయాలా?

శశి కాంక్ష ఈడేర్చడంకోసం, తాను ఇన్నాళ్ళూ నమ్మిన ఆరాధించిన న్యాయ పథాన్నుండి తొలగి, అడ్డదారులు తొక్కవలసిందేనా? లేక చట్టపు కరాళదంష్ట్రలలో చిక్కి, ప్రియుణ్ణి కోల్పోయి విధవయై తన శశి మసి కావలసిందేనా?

శశి మసి కావడమా? ఆ ఆలోచనను కూడా సహించలేకపోయాడు జగన్నాథం. న్యాయమైనా కాని, ధర్మమైనా కాని, చట్టమైనా కాని, తన శశికి తాను అన్యాయం చేయలేడు. తన శశికోసం తాను పతితుడు కాకతప్పదు. ఈ శశికోసమే తాను పదేళ్ళక్రితం న్యాయాన్ని, ధర్మాన్ని తప్ప సర్వస్వం త్యాగం చేశాడు. ఈనాడు ఆ శశికోసమే ధర్మాన్ని కూడా త్యాగం చేస్తాడు. చేయక తప్పదు, తప్పదు, తప్పదు.

జగన్నాథం ఒక నిశ్చయానికి వచ్చాడు. శశి కంఠం వినిపించింది.

"నీవు తప్పకుండా అతన్ని విడిచిపెట్టెయ్యాలి." దృఢంగా పలికింది శశి.

"అలాగే! శశీ! అలాగే. నీ కోర్కె ఏనాడు కాదన్నాను కనుక, ఈనాడు కాదనడానికి? ఆనాడు నన్ను సంఘ భ్రష్టుణ్ణి చేశావు. ఈనాడు ధర్మచ్యుతుణ్ణి చేస్తున్నావు. కాని నేను దేనికీ చింతించడం లేదు శశీ! నీవు నన్నేం చేసినాసరే. నిన్నే నాడు మొదటిసారిగా చూశానో, ఆనాడే నా జీవితాన్ని నీ చేతుల్లో ఉంచాను. దాన్ని నీవు ఎలా ఉపయోగించుకున్నా నాకు సంతోషమే శశీ!"

జగన్నాథం కంఠంలో అత ననుభవించిన ఈ పదేళ్ళ మూగ వేదన ప్రజ్వరిల్లుతున్నది.

అతని వేదనాపూరితస్వరం విని చలించింది శశి. తనపై అతనికున్న అనురాగానికి పులకరించింది ఆమె హృదయం. కాని, వెంటనే తాను అతనికి చేస్తున్న అన్యాయం తలపుకువచ్చి, జలదరించింది ఆమె మనసు.

"జగ్గూ" అంటూలేచి జగన్నాథాన్ని కావలించుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది శశి.

"జగ్గూ! నీకు నేనన్ని విధాలా అన్యాయం చేస్తున్నాను. నీకోసం నీ ఉన్నతికోసం నా జీవితాన్ని కూడా త్యాగం చేయగలనని తలచానే కాని, నాకోసం నీవుసర్వం త్యాగం చేయవలసి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. పోనీలే జగ్గూ! నాకోసం నీవు నమ్మిన న్యాయాన్ని బలిపెట్టకు." దుఃఖంతో శశి కంఠం పూడుకుపోయింది.

ఆమె వీపు నిమురుతూ జగన్నాథం అన్నాడు: "వద్దు శశీ! నీ కడసారి కోర్కె తీర్చకుండా ఉంటే నాకిక మనశ్శాంతి కూడా కరువవుతుంది. వద్దు శశీ! వద్దు. నీ కోర్కె తీర్చనివ్వు నన్ను. మరో జన్మ అనేది ఉంటే, అప్పుడయినా నీవు నా భార్యవవుతావని ఆశిస్తున్నాను. తప్పకుండా నీవు కోరినట్లే జరుగుతుంది శశీ!"

అతని మాటలు వింటున్నకొద్దీ శశికి దుఃఖం ఆగడంలేదు. అతని కౌగిలిలో కరగిపోతూంది ఆమె హృదయం. తన మంగళసూత్రాలను కళ్ళ కద్దుకుని, జగన్నాథం కౌగిలినుండి విడవడింది శశి. వారి కడసారి కౌగిలి వీడిపోయింది.

"నీ ప్రేమ చాల పవిత్రమయినది జగ్గూ! నీ ప్రేమను ఈ పతితురాలిపై చూపకు. నీ ప్రేమకు నేను తగను. నిన్ను అన్ని విధాలా నాశనం చేశాను. ఇక ఈ జన్మకు నా పాడు మొహం నీకు కనుపించ నివ్వను. నన్ను మరిచిపోవడానికి ప్రయత్నించు జగ్గూ! వస్తా."

భారమైన హృదయంతో మెల్ల మెల్లగా వెళ్ళిపోయింది శశి.

అచేతనంగా నిలబడ్డాడు జగన్నాథం. అలా ఎంతసేపు నిలబడిపోయాడో అతనికే తెలియదు. "వంటయింది బాబూ" అన్న వంటమనిషి కేకతో ఈ లోకంలో పడ్డాడు. ఏకధారగా కారిపోతున్న తన వేడి కన్నీటిని ఆపుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేశాడు జగన్నాథం.

తన శశికోసం చట్టం కంఠం కోయడానికి కలం చేతిలోకి తీసికొన్నాడు జగన్నాథం.

మరునాటి దినం—

జగన్నాథం కోర్టులో "తీర్పు" చెప్పాడు. అందరూ ఆశ్చర్యపడ్డారు. ప్రేక్షకుల స్థానం నుండి కంట తడిపెడుతూ లేచిపోతున్న శశిని ఒక్కక్షణం మాత్రం చూడగలిగాడు జగన్నాథం.

మరునాడు ఉదయాన్నే జగన్నాథం ప్రాణవాయువులు వినీలాకాశంలో లీనమైపోయాయి. కొందరు విషం తిన్నాడన్నారు. కొందరు ఉరి పోసుకున్నా డన్నారు. కొందరు గుండె ఆగి చని పోయా డన్నారు. కాని, నిజం చెప్పడానికి జగన్నాథం యిక లేడు—

ఎవరి ప్రాణాన్ని కాపాడడానికి జగన్నాథం తన ప్రాణాన్ని త్యాగం చేశాడో ఆతను ఆ రోజే దేశాల పాలైపోయాడు.

ఒక పిచ్చిది మాత్రం కొద్ది రోజులు ఆ పట్టణంలో "జగ్గూ! జగ్గూ!" అంటూ పిచ్చిగా కేకలు వేస్తూ తిరిగింది. ఒక రోజు ఆ పిచ్చిది ఆ బంగళా ఆవరణలో నున్న బావిలోపడి మరణించింది—

అతకని బ్రతుకులకు, విసిగిపోయి, విధి ఇచ్చిన "తీర్పు" పాటించి జగన్నాథం, శశి అకాలంలో మరో లోకం వెళ్ళిపోయారు. ★



చోళ రాణి
(నాగేశ్వరాలయం)
ఫోటో—'భరద్వాజ' (మద్రాసు-18)